

ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్ శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



ఎపిఎస్ ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 17వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణకు లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి ఎ.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరులో ప్రారంభమయ్యే 17వ బ్యాచ్‌లో 16 మందికి శిక్షణ పొందడానికి అవకాశం ఉంటుందని, దీన్ని సద్వినియోగం చేసుకొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫీజు ఇతర వివరాలకు 7382923293, 7095040608, 7382924758 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

'వక్ఫ్' ఆస్తులను కాజేసేందుకే...

- మైనార్టీల వ్యతిరేక చర్యకు పూనుకున్న కేంద్రం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న మహిబుల్లాఖాన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ముస్లిం మైనార్టీలను వక్ఫ్ బోర్డు నుంచి తొలగించే లా ఉందని, ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం మైనార్టీల వ్యతిరేక చర్యకు పూనుకుందని వక్తలు అభిప్రాయపడ్డారు. నగరంలోని జామియా మసీదులో శనివారం వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై అఖిల పక్ష చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముస్లిమేతరులను వక్ఫ్ కమిటీల్లో పెట్టాలని, వారికీ హక్కులు కల్పించాలనటంలో కేంద్ర ప్రభుత్వ కపటత్వం బయట పడిందని అన్నారు. ముస్లిములపై చిత్తశుద్ధి ఉంటే సచార్ కమిటీ నివేదిక, రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సులపై పార్లమెంట్‌లో పెట్టి చర్చించి అమలు చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ముస్లిములనే లక్ష్యంగా చేసుకొని వారి ఆర్థిక, సాంఘిక, వాణిజ్య, విద్య, బాష, సంస్కృతిపై భౌతిక దాడులకు దిగుతోందని విమర్శించారు. వక్ఫ్ ఆస్తులను, హస్తగతం చేసుకోవడానికి అనేక కుట్ర పూరిత చర్యలకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. ఇప్పటికే వక్ఫ్ ఆస్తులు, భూములను అధికార పార్టీల నాయకులు కబ్జాలకు పాల్పడ లేదా? అని ప్రశ్నించారు. విభజించు, పాలించు అనే సూత్రాన్ని కేంద్ర ప్రభుత్వం విడనాడాలని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. వక్ఫ్ అనేది ముస్లిం మైనారిటీల దేవాదాయ భూమి అని ముస్లిములు దైవ సంబంధమైన, సేవాపరమైన పవిత్ర కార్యక్రమాలకు తమ సొంత భూముల్ని అస్తులను దానం చేస్తారని తెలిపారు. దేశంలో 9 లక్షల 20 వేల ఎకరాలు భూమి వక్ఫ్ కింద ఉందని అన్నారు. ఈ భూములను కార్పొరేట్ల స్వప్రయోజన పరులు కాజేసేందుకు ఈ చట్ట సవరణ వాడుకో చూస్తున్నారని తెలిపారు. వక్ఫ్ ట్రిబ్యునల్స్‌లో ఇంతవరకు ఒక ముస్లిం న్యాయకోవిదుడు కచ్చితంగా ఉండాలని నిబంధన ఉందని అన్నారు. ఇప్పుడు దానిని తొలగించేశారని ఈ విధంగా ముస్లిముల దేవాదాయ వ్యవహారాలపై ముస్లిమేతరుల పెత్తనాన్ని ప్రతిష్టించాలని బిజెపి ప్రయత్నిస్తోందని తెలిపారు. ఇండి యా కూటమి పార్టీలు పార్లమెంట్‌లో తీవ్రంగా ప్రతిఘటించడంతో బిల్లును జాయింట్ పార్లమెంటరి కమిటీకి పంపినా అది తాత్కాలిక వెనకడుగు మాత్రమేనని గ్రహించాలని చెప్పారు. కార్యక్రమంలో మహిబుల్లాఖాన్, సురంగి మోహనరావు, రౌతు శంకరరావు, వి.జె.కె.మూర్తి, భవిరి కృష్ణమూర్తి, శ్రీనివాసు, గంజి ఆర్ ఎజ్రా, కంఠ వేణు, గణేష్, పిసిని చంద్రమోహన్, బాడాన దేవభూషణరావు, బాష పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని, పరిశ్రమల్లో పనిచేసే ప్రతిఒక్కరూ సురక్షితంగా ఉండేలా, వారి ఆరోగ్యానికి హాని లేకుండా ఎలా పని చేయాలో తెలిపేలా యజమానులు తమ కార్మికులకు సరైన సమాచారం, సూచన, శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లాలో అన్ని పరిశ్రమలు దీనిపై రానున్న రెండు వారాల పాటు సంపూర్ణ శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాలోని భారీ, మధ్య తరహా పరిశ్రమల ప్రతినిధులతో అత్యవసర సమావేశంలో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డితో కలిసి మాట్లాడారు. పరిశ్రమల్లో పనిచేసే ప్రతిఒక్క రూ సురక్షితంగా ఉండేలా, వారి ఆరోగ్యానికి ఎటువంటి హాని లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్మికులకు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని పరిశ్రమల భద్రతపై అవగాహన ఉండేలా రానున్న రెండు వారాల పాటు శిక్షణ ఇవ్వాలన్నారు. పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదా ల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల యజమానులు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. అమోనియా, క్లోరిన్, ఎల్పీజీ, బ్యుటెన్ వంటి మండే స్వభావం ఉన్న వాయువులను పెద్ద పరిమాణంలో వినియోగించే పరిశ్రమల్లో కట్టుదిట్టమైన భద్రత ప్రమాణాలు ఉండాల న్నారు. ఎప్పటికప్పుడు భద్రతా ప్రమాణాలపై తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే పూర్తి చేసిన తనిఖీల నివేదిక ఆధారంగా అన్ని పరిశ్రమలు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మార్గదర్శకాలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాలను కట్టడి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని వివరించారు. రసాయన విపత్తు నిర్వహణ, పూర్తి బాధ్యత యాజమాన్యలు తీసుకోవాలన్నారు. ప్రణాళిక విభాగం, సెర్చ్, రెస్క్యూ యూనిట్, ఉపశమనం, పునరావా సం, కమ్యూనికేషన్, రవాణా, లాజిస్టిక్, అత్యవసర వైద్య సదుపాయాల కల్పన వంటి అంశాలపై సమీక్షించారు. సమావేశానికి జెసి ఫర్మాన్ అహ్మద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, ఏడీ రమణారావు, జిల్లా అగ్ని మాపకశాఖ అధికారి మోహనరావు, పర్యావరణశాఖ ఇంజినీర్ రామారావు నాయుడు, రెడ్డిస్ లాబొరేటరీస్, యునైటెడ్ బ్రేవరెస్, నాగార్జున అగ్రికెమ్, అరబిందో ఫార్మా, ఆంధ్రా ఆర్గానిక్, స్మార్ట్ కెమ్ టెక్నాలజీ, విశాఖ డెయిరీ, సరాఖ లాబ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్‌స్టాన్సెస్ కేసుల దర్యాప్తుకు సంబంధించిన గంజాయి వంటి మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల వంటి కేసుల దర్యాప్తు, ప్రాపర్టీని స్వాధీనం చేయడానికి చట్టా ప్రకారం నిబంధనలు పాటించాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి పోలీస్ అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని నార్కో డ్రగ్స్, సైబర్ కేసులు దర్యాప్తు, నూతన చట్టాలపై విశ్రాంత అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.రామకృష్ణతో కలిసి శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాలను గుర్తించే విధానం, ఎన్‌టిపిఎస్ కేసులను నమోదు, దర్యాప్తు, నిందితుల అరెస్టు, మధ్య వర్తనామ, సాక్ష్యాల సేకరణ, సీజ్ చేసిన మత్తుపదార్థాలను నిర్వీర్యం ప్రక్రియ తదితర విషయాలపై పోలీస్ అధికారులకు వివరించారు. ఆయా కేసులపై అధికారులకు ఉన్న పలు సందేహాలను నివృత్తి చేశారు.

భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్‌ఎస్‌ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం (బిఎస్‌ఎ) చట్టాలపై పోలీస్ అధికారులకు పూర్తి అవగాహనా కల్పించి కొత్త, పాత చట్టాల్లో మార్పులు క్షుణ్ణంగా వివరించారు. కొత్త చట్టాల్లో అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన పెంచుకొని బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, నూతన చట్టాల అనుసరించి కేసులను నమోదు చేయాలని రామకృష్ణ తెలిపారు. సైబర్ నేరాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు పోలీస్ అధికారులు వెంటనే స్పందించాలన్నారు. నగదు లావాదేవీల వివరాలు, నగదు విలువ, ఐడి వివరాలు, ఇతర



మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన ఎస్‌పి మహేశ్వర రెడ్డి

విషయాలు 1930కు కాల్ చేయించి రిజిస్ట్రార్ చేసినచో, వారు వెంటనే స్పందించి బ్యాంకు అధికారుల దృష్టికి నేరం వివరాలు తీసుకువెళ్లి, అమాయక ప్రజల నుంచి కాజేసిన డబ్బులు సైబర్ నేరగాళ్ల చేతికిపోకుండా అకౌంట్ ఫ్రీజ్ చేయిస్తామని సోషల్ మీడియా సెల్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్, పోలీస్ లీగల్ అడ్వైయిర్ యామని రాణి, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

117 జిఒను రద్దు చేయాలి

శ్రీకాకుళం అర్బన్ : 117 జిఒను తక్షణమే రద్దు చేయాలని, 53 ప్రకారం పని సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు డిమాండ్ చేశారు. డిఇఒ కార్యాలయంలోని డిఇఒ తిరుమల చైతన్యను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉంటే ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేయాలన్నారు. మెదడాలజీ పేరుతో ఎస్‌జిటిలను పంపించడం గందరగోళంగా ఉందన్నారు. డివిజన్ స్థాయికి ఎస్‌జిటిలను పంపించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని, ఇటువంటి విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని అన్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయి అవార్డులు పారదర్శకంగా ఇవ్వాలన్నారు. జిల్లాస్థాయి



వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అవార్డులకు రెండు రోజులు గడువు పెంచాలన్నారు. సర్వీస్ రెగ్యులైజేషన్లు వెంటనే పూర్తిచేసి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిఇఒను కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, కోశాధికారి రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శులు ఎస్.స్వర్ణకుమారి, జి.సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ పొందూరు అప్పారావు, రెడ్డి త్రినాథరావు, పురుషోత్తం, ధనుంజయరావు పాల్గొన్నారు.

ఫరీదుపేటలో ఉద్రిక్తత

- దాడిలో గాయపడిన వ్యక్తి మృతి
- వైసిపి నాయకుల ఆందోళన
- గ్రామంలో పోలీస్ పికెట్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం ఫరీదుపేటలో ఈ నెల 18న జరిగిన దాడి ఘటనలో గాయపడిన కూన ప్రసాద్ (24) విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. వైసిపి సానుభూతిపరుడైన ప్రసాద్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మాటు వేసి కొంతమంది యువకులు రాళ్లతో దాడి చేశారు. దీంతో ఆ యువకుడు పరుగులు తీసి సమీపంలోని డాభా పైకి ఎక్కగా, అక్కడికీ వెళ్లి ప్రసాద్‌ను కర్రలతో దాడి చేశారు. తలకు తీవ్ర గాయాలు కావటంతో శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. ఆరు రోజుల పాటు చికిత్స పొందుతూ పరిస్థితి విషయమించి మృత్యువాత పడ్డాడు. కెజిహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని స్వగ్రామం ఫరీద్‌పేటకు తీసుకొచ్చారు.



ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు

బాధ్యులను శిక్షించాలి : మాజీ ఎమ్మెల్యే

ప్రసాద్ మృతదేహం స్వగ్రామానికి చేరుకునే సమయంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ఎంపిపి మొదలవలస చిరంజీవి చేరుకొని మృతుడికి న్యాయం చేయాలని, అసలైన దోషులను శిక్షించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజాప్రతినిధులు, వైసిపి కార్యకర్తలు కొయిరాల కూడలి వద్దకు చేరుకొని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టిడిపి మూడు నెలల పాలనలోనే ఇటువంటి హత్య రాజకీయాలు పెరిగిపోయాన్నారు. ప్రసాద్‌ను వెంటబెట్టి మరీ హత్య చేశారని, పోలీసులు మొక్కుబడిగా అరెస్టులు చేసి చేతులు దులుపుకున్నారని, ఇటువంటి చర్యలతో ప్రజల్లో భయభ్రాంతులను సృష్టించడం సరికాదని అన్నారు. డిఎస్‌పిలు శ్రీనివాసరావు, శేషాద్రి, సిఐలు అవతారం, పైడిపునాయుడు, ప్రసాద్, ఇమ్మాన్యుల్‌రాజు, ఏడుగురు ఎస్‌ఐలు, 110 మంది పోలీసులు గ్రామంలో అల్లర్లు జరగకుండా పర్యవేక్షించారు. సిఐ అవతారం మాట్లాడుతూ నిందితులను అరెస్టు చేస్తామని చెప్పడంతో మృతదేహాన్ని అక్కడ నుంచి తరలించారు. దీంతో గ్రామంలో పోలీస్ పికెట్ నిర్వహించారు.

రిజర్వాయర్లను ఆధునీకరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- మందస

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని మండలంలోని కళింగదళ్, దబార్‌సింగ్, గోపాలసాగరం, దామోదరసాగరం రిజర్వాయర్లను ఆధునీకరించి ప్రతి ఎకరాకూ సాగునీరు ఇవ్వాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం పార్టీ సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళింగదళ్ రిజర్వాయరు ఆయకట్టు ఏడు వేలు ఎకరాలు, డాబార్‌సింగ్ వెయ్యి ఎకరాలు, దామోదరసాగర్ రిజర్వాయరు రెండు వేల ఎకరాటు సాగునీరు ఇవ్వాల్సి ఉందన్నారు. మదుములు పాడై, కాలువలు తవ్వక, షట్టర్లు నాసిరకం కావడంతో నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతుందని అన్నారు. చీపి గెడ్డ నుంచి వృథాగా పోతున్న నీటిని గోపాలసాగరానికి మళ్లించడం ద్వారా పది గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాలకు నీరు అందించవచ్చునని అన్నారు. డాబార్‌సింగ్ రిజర్వాయరులో వర్షాకాలంలో కూడా చుక్కనీరు లేదని, ప్రాజెక్టు డిజైనింగ్ లోపమే రైతులకు శాపంగా మారిందని పేర్కొన్నారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యంగా



మాట్లాడుతున్న గోవిందరావు

వ్యవహరించడంతో మహేంద్ర గిరులు నుంచి వచ్చిన నీరు వృథాగా సముద్రపాలవుతుందని విమర్శించారు. పాలకుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతాంగానికి తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. నదీ జలాలను ఉపయోగించుకోవడంలో పాలకలు వైఫల్యం చెందారన్నారు. ప్రాజెక్టులు కట్టి నాలుగు దశాబ్దాలు కావస్తున్న కాలువలు తవ్వడం పూర్తికాలేదని అన్నారు. కార్యక్రమంలో జీడి రైతు సంఘం జిల్లా కన్వనర్ తెప్పల అజయ్ కుమార్, ఎపి రైతు సంఘం నాయకులు సంగారు లక్ష్మీనారాయణ, కె.కేశవరావు, అర్.ఏకాశి, ఎన్.లచ్చయ్య, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రోగులపై ఆర్థిక భారం వేస్తే చర్యలు

శ్రీకాకుళం అర్బన్ : డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద వైద్యం పొందే రోగులపై ఆర్థిక భారం వేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రయివేటు ఆస్పత్రి యాజమాన్యాలను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య అమలుతో పాటు 104,108 సేవలపై శనివారం సమీక్షించారు. ఎన్‌టిఆర్ వైద్య సేవకు సంబంధించి ఆస్పత్రిల్లో కొందరు వైద్యులు అదనపు మొత్తాలను వసూలు చేస్తున్న ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. అటువంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రుల్లో చేరే రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్యం అందించే బాధ్యత ఆరోగ్య మిత్రలపై ఉందన్నారు. రోగులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిని నేరుగా ఆరోగ్య సేవ సమావేశానికి హాజరు కావలన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రకాశరావు మాట్లాడుతూ ఆస్పత్రుల్లో రోగుల వైద్య పరీక్షల ఛార్జీల పట్టికలను బహిరంగంగా ఉంచాలన్నారు. సెకండరీ పరీక్షలకు నగదు వసూలు చేయడం నేరమన్నారు. ఫైర్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రోగులకు ఇస్తున్న భోజనం మెనూలో పాలు, పళ్లు ఉండాలన్నారు. 108 సర్వీసులను పక్కాగా వినియోగించాలని వివరించారు. సమావేశంలో డిసిహెచ్ డాక్టర్ రాజ్యలక్ష్మి, డెప్యూటీ డిఎంహెచ్ఒ శ్రీకాంత్, జెమ్స్ జనరల్ మేనేజర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కిమ్స్ ఎండీ డాక్టర్ సోమేశ్వ రరావు, మెడికవర్ మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



ప్రజలతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి: మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని సంతబొమ్మాళి పంచాయతీలో శనివారం బైక్‌పై కంద్రవీధి, కొన్న వీధి, వెలమ వీధి, గొల్ల వీధి, బిసి కాలనీ, ఎస్‌సి కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యను తెలుసుకున్నారు. కాలువలు, సిసి రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. కాలువల్లో పూడికతీత తీయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నామని, శ్మశానానికి రహదారి, షెడ్డు నిర్మించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని టిడిపి నాయకులు కుచెట్టి కాంతారావు, మెండ అప్పారావు, కూచెట్టి భాను ప్రకాష్, చల్ల జగ్గారావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందిస్తూ... అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న, తంగి రమణమూర్తి, ఎంపిడిఒ సిహెచ్.ప్రేమలీల, తహశీల్దార్ ప్రవీణ్‌కుమార్, పంచాయతీరాజ్ జెఇ విష్ణుప్రియ, హౌసింగ్ ఎఇ నర్సింగరావు, విద్యుత్‌శాఖ ఎఇ మెట్ట శివకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్ : ఉత్పాదకత పెంపు పేరుతో పంటల సాగులో రసాయనాలు వినియోగిస్తుండడంతో రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను పొందలేకపోతున్నారని, అందువల్ల ప్రకృతి వ్యవసాయం రైతులు అలవర్చుకుని నాణ్యమైన ఉత్పత్తులను పండించాలని వ్యవసాయ శాఖ జెడి కె.శ్రీధర్ సూచించారు. వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై ఒక్క రోజు వర్కుషాపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా జిల్లాలో నాణ్యమైన ఉత్పత్తులు సాధించడంతో అధిక ఆదాయాన్ని పొందడానికి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జెడి శ్రీధర్

వీలవుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రకృతి సాగుచేసి ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి స్థాయికి ఎదగాలన్నారు. ఎపి సిఎస్‌ఎఫ్ డిపిఎం రేవతి, డిఆర్‌సి డిడి త్రినాథస్వామి, ఎడిఎ డాక్టర్ భవానీశంకర్ పాల్గొని సాగు విధానంపై సమగ్రంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయానికి తొమ్మిది సార్వత్రిక సూత్రాలను కె.ప్రకాష్ వివరించారు. కార్యక్రమంలో కృష్ణారావు పాల్గొన్నారు.

గ్రామసభల్లో గొప్పల డప్పు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

పల్లెల అవసరాలు తెలుసుకోవాలనే ఉద్దేశంతో నిర్వహించిన గ్రామసభల్లోనూ టిడిపి కూటమి ప్రజాప్రతినిధులు, నాయకుల గొప్పల డప్పు తప్పలేదు. సమస్యల ప్రస్తావన కంటే సొంత డబ్బాలు కొట్టుకోవడమే కనిపించింది. సభలకు హాజరైన అధికార కూటమి పార్టీల ఎమ్మెల్యేలు ఆయా పార్టీలకు చెందిన అగ్రనేతలను ఆహా... ఓహో అంటూ కీర్తించారు. చివరకు సభలకు వచ్చిన ద్వితీయ శ్రేణి నాయకులూ తగ్గేదే లే అంటూ పోటీపడి మరీ పొగిడారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, బాబుతోనే అభివృద్ధి సాధ్యమంటూ అని టిడిపి నాయకులు కీర్తిస్తే... గ్రామాల అభివృద్ధికి నిర్ణయం తీసుకున్న గొప్ప వ్యక్తి తమ నేత అంటూ జనసేన నాయకులు తమ ప్రసంగాల్లో ప్రస్తుతించారు. గ్రామాల సభల ద్వారా ఎంతో కొంత లబ్ధిపొందేందుకు బిజెపి తన వంతు ప్రయత్నించింది. గ్రామసభల్లో పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చింది. దీంతో నాయకులు లేకపోయినా కార్యకర్తలే వేదిక ఎక్కి మోడీ, బిజెపి ప్రభుత్వ గొప్పల డప్పు వాయించారు. పంచాయతీలకు డబ్బులు, ఉపాధి హామీకి సొమ్ములు కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందంటూ బడాయిలకు పోయారు. అక్కడే ఉన్న టిడిపి నాయకులు, శ్రేణులకు వారి మాటలు కొంత ఇబ్బంది కలిగించాయి. కూటమిలోనే ఉంటూ సొంత లబ్ధికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రయత్నించారు. కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వ, నాయకుల గొప్పలు చెప్తూనే పనిలో పనిగా ప్రతిపక్ష వైసిపిపై విమర్శలు దాడికి దిగాయి. గత వైసిపి ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసిందం టూ విమర్శలు గుప్పించారు. అదే సందర్భంలో తెలుగు తమ్ముళ్లు బాబు పాలనను ఆకాశానకెత్తేశారు. చంద్రబాబు ఐదేళ్లలో పంచాయతీల రూపురేఖలను మార్చేస్తారంటూ ప్రసంగాలతో ఊదరగొట్టారు. సభకు వచ్చిన జనం వారి మాటలు విని ముక్కున వేలేసుకున్నారు. మరి ఇప్పటివరకు 15 సంత్సరాలు (మూడు ఐదేళ్లు) ముఖ్యమంత్రిగా చంద్రబాబు పని చేసినా గ్రామాల రూపు రేఖలు మారలేదే వారిలో వారు గొణుకున్నారు. పైగా గ్రామాల నుంచి ఏటికేడు గ్రామాల నుంచి వలసలు పెరుగుతూనే ఉన్నాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలోనూ, ఇటీవల ఎన్నికల ప్రచార సభల్లో జిల్లా వెనుకబాటుపై అనేక పర్యాయాలు ప్రస్తావించారు. దేశంలో ఎక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నా శ్రీకాకుళం వారే కనిపిస్తున్నారని, రాబోవు రోజుల్లో ఇతర ప్రాంతాల నుంచే జిల్లాకు వలసలు వచ్చేలా అభివృద్ధి చేస్తామని చెప్పితే నిజమే కాబోలు అని అంతా మురిసిపోయారు. తాము, తమ పిల్లలు ఇంకా ఎక్కడికీ వెళ్లనక్కర్లేదని, ఉన్న ఊర్లోనే ఉపాధి పొందొచ్చని అనుకున్నారు. టిడిపి ప్రభుత్వ ఐదేళ్లలో ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు. జిల్లాలో అప్పటివరకు కాస్తాకూస్తో ఉపాధి కల్పిస్తున్న జ్యూట్ పరిశ్రమలూ మూతపడ్డాయి. జెట్టీలు, హార్బర్లు అంటూ ఐదేళ్లు కాలక్షేపం చేసి వాటినీ నిర్మించకపోవడంతో మత్స్యకారుల్లోనూ వలసలు ఆగలేదు. రోడ్లు వేసి, రెండు బిల్డింగ్‌లు నిర్మించి వాటితోనే గ్రామాల రూపు రేఖలు మారిపోతాయని ప్రజలను నమ్మించమంటే అంతకంటే వంచన మరొకటి ఉండదు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి అడిగిన వారందరికీ పనులు కల్పించడం, పంటలకు గిట్టుబాటు ధర, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు వంటి చర్యలు చేపట్టడం ద్వారా ప్రజల ఆదాయాలు పెరిగి, కొనుగోలు శక్తి పెరిగే అవకాశాలు ఉన్నాయి. తద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందే తప్ప రోడ్లు వేసి, రెండు బిల్డింగ్‌లు నిర్మించి వాటితోనే గ్రామాల రూపురేఖలు మారిపోతాయని నమ్మించడమంటే ప్రజలను భ్రమల్లో ముంచడమే అవుతుంది. పాలకులకు ఇది తెలిసినా అభివృద్ధి, పెట్టుబడులు జపం చేయడం ద్వారా కొంతకాలం పాటు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, సూపర్ సిక్స్ పథకాల నుంచి వారి దృష్టిని మళ్లించిడానికి చేస్తున్న ప్రయత్నాలుగా కనిపిస్తున్నాయి.

రాజ్యాంగాన్ని, చట్టాన్ని వైసిపి గౌరవించడం లేదంటూ గతంలో గగ్గోలు పెట్టిన టిడిపి ఇప్పుడు అదే పనికి పూనుకుంది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామసభలకు ముఖ్య అతిథిలుగా పిలవాల్సిన సర్పంచ్‌లను చాలా చోట్ల విస్మరించారు. వైసిపి సానుభూతిపరులన్న కారణంతో వారిని పిలవలేదు. చాలాచోట్ల వారు లేకుండానే సభలు నిర్వహించారు. కొన్నిచోట్ల వారిని అవమానపరిచన ఘటనలూ చోటు చేసుకున్నాయి. జలుమూరు మండలం జోనంకిలో గ్రామానికి సంబంధించి ఓ చెరువు విషయంలో వివాదం తలెత్తగా... సర్పంచ్ జి.వి.రమణికి టిడిపి నాయకులు చెప్పులు చూపించి 'మా ప్రభుత్వం, మా ఇష్టం ఎవరు అడ్డు వస్తారో చూస్తాం' అని పరుష పదజాలంతో దూషించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో తన మాటే శాసనంగా అధికారం చెలాయించిన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సతీమణి వాణికి సైతం పరాభవం తప్పలేదు. ఆమదాలవలస మండలం తొగరాం సర్పంచ్‌గా గ్రామసభ నిర్వహణపై తనకు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తమ నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవంలో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ చూడలేదని ఆమె చెప్పడం నాటి జగన్ పాలనపై టిడిపి నాయకుల విమర్శలను గుర్తు చేసింది. శ్రీకాకుళం మండలం సానివాడలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్న సభలోనూ స్థానిక ప్రజా ప్రతినిధులకు అవమానం తప్పలేదు. తమ గ్రామం పేరు మార్చాలని వైసిపి జడ్‌పిటిసి రుప్ప దివ్య విజ్ఞప్తిపై గత ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు మార్చుకోలేదంటూ మంత్రి అచ్చెన్నా యుడు వ్యంగ్యంగా మాట్లాడారు. గ్రామ సమస్యలు చెప్పమంటే హడావుడి ప్రశ్నలు ఎందుకమ్మా అంటూ అచ్చెన్నాయుడు అనడంతో ఆమె చిన్నబోయారు. ఇలా అనేక చోట్ల గ్రామ ప్రథమ పౌరులు, స్థానిక ప్రజాప్రతినిధులకు చేదు అనుభవాలు ఎదరయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైందని, సర్పంచ్‌లకు గౌరవం లేకుండా చేసిందని, తాము వారిని సముచితంగా గౌరవిస్తామంటూ చెప్పిన కూటమి ప్రభుత్వం గ్రామాల్లో వారిని అగౌరవ పరచడం ద్వారా విమర్శలను మూటగట్టుకుంది. గ్రామాల అభివృద్ధికి పంచాయతీ పాలకవర్గాలే కీలకమైనందున రాజకీయ పార్టీలకతీతంగా అవి తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలిపి సమిష్టిగా పని చేస్తేనే పల్లెల్లో ప్రగతి సాధ్యపడుతుంది. ఈ విషయాన్ని గుర్తించి పాలకులు ఆ దిశగా అడుగులు వేస్తారని ఆశిద్దాం.

'కొత్తమ్మతల్లి' ఉత్సవాలకు ఆహ్వానం

కోటబొమ్మాళి: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ కలిశారు. మండలంలోని నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. అక్టోబరు 1,2,3వ తేదీల్లో కొత్తమ్మవారి పండగలు నిర్వహిస్తామని మంత్రికి వివరించారు. త్వరలో కొత్తమ్మతల్లి ఆలయానికి వచ్చి ఉత్సవాల గురించి మాట్లాడతానని ఇఒకు మంత్రి వివరించారు. అనంతరం మంత్రికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

27న అరసవల్లి హుండీ లెక్కింపు

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్య నారాయణ స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని ఈ నెల 27న తెరవనున్నట్లు ఆయన ఇఒ, దేవాదాయశాఖ ఉప కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ ఒక తెలిపారు. ఉదయం 8 గంటలకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలక మండలి సభ్యులు, అర్చకులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు తెలిపారు. ఆలయ సాంప్రదాయ బద్ధంగా హుండీల్లో ఆదాయాన్ని లెక్కిస్తామని తెలిపారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎమ్మెల్యే ఆర్థికసాయం

ప్రజాశక్తి - పాతపట్నం

ఎమ్మెల్యే దత్తత తీసుకున్న మండలంలోని తామరలోని పద్మాన ఫాల్గుణరావు, రమ దంపతుల కుమార్తె ధనలక్ష్మి వివాహం కానుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పసుపు కుంకుమ కింద రూ.20 వేలు ఆర్థికసాయం శనివారం అందజేశారు. దీంతో ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని ప్రజలకు ఏ సమయంలో అవసరమున్నా నేను అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో తామర సర్పంచ్ ఇప్పిలి ధనుంజయ, ఎంపిటిసి మాజీ సభ్యులు కొయిలాపు సంజీవరావు, వావిలపల్లి వెంకటరమణ, చిన్నబాబు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న రమణకుమార్

బాలల హోం తనిఖీ

ప్రజాశక్తి - కొత్తూరు

కొత్తూరు, హిరమండలం మండలాల్లోని బాలల హోంను జిల్లా ప్రాజెక్టు అధికారి రమణకుమార్, జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణలు శనివారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కొత్తూరు బాలల హోమ్ నిర్వహణ సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిరమండలంలోని బాలల హోమ్ తనిఖీ సమయంలో 40 మంది పిల్లలు ఉన్నారని అన్నారు. నిబంధనల ప్రకారం ఎటువంటి అనుమతులు లేవని గుర్తించామన్నారు. నిర్వాహకుడు డేనియల్ వద్ద వివరాలు సేకరించి పూర్తి విచారణ చేపడతామని, అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీరి వెంట ఐసిడిఎస్ పిఒ విమలకుమారి, బాల రక్షణాధికారి ఎం.మల్లేశ్వరరావు, ఎల్‌సిపిఒ టి.లక్ష్మణరావు, సూపర్‌వైజర్లు ఎల్.శాంతికుమారి, కె.సుధారాణి ఉన్నారు.


రీ సర్వే చేస్తున్న సర్వేయర్లు

'చొక్కాకుల బంద' రీ సర్వే

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని 6వ వార్డు పరిధిలోని కె.మన్నయ్య పేటలోని చొక్కాకుల బందను శ్రీకాకుళం మండల సర్వేయర్ చల్లా రఘు ఆధ్వర్యంలో రెవిన్యూ బృందం శనివారం రీసర్వే చేపట్టారు. 'ఆక్రమణలో చొక్కాకుల బంధ' పేరుతో ప్రజాశక్తిలో వచ్చిన శీర్షికకు స్పందించిన రెవెన్యూ అధికారులు శనివారం చొక్కాకుల బంద వద్దకు చేరుకుని 15 మంది సర్వేయర్ల బృందం రీసర్వే చేపట్టి హద్దులను గుర్తించారు. ఈ సందర్భంగా సర్వేయర్ రఘు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్ ఆదేశాల మేరకు ఆక్రమణకు గురైన చొక్కాకుల బందను రీసర్వే చేపట్టి హద్దులను నిర్ణయించామని తెలిపారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారి ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఈ రీసర్వేలో డిప్యూటీ తహశీల్దార్ శంకర్, విఆర్‌ఒ కె.చంద్రరావు, ప్లానింగ్ సెక్రెటరీ చైతన్య, సచివాలయ సర్వేయర్ తిరుమల, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బిఆర్‌ఎయు విసి రజని

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని సూచించారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర ప్రచార శాఖతో కలిసి ఏక్ పేడ్ మా కే నామ్ (తల్లి పేరిట ఒక మొక్క నాటడం) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాల పరిసరాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటరీలను ఉద్దేశించి మాట్లాడారు. కాలుష్యం అధికం అవుతుండటం, దీని ప్రభావంతో అనారోగ్య సమాజం ఏర్పడుతుందని అన్నారు. పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో ఏక్ పేడ్ మాకే నామ్‌లో భాగంగా మొక్కలు విరివిగా నాటడం అలవాటు చేసుకోవాలన్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ జిల్లా అధికారి బి.తారకప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని ఆలోచనల్లో భాగంగా దేశమంతా పెద్ద ఎత్తున తల్లిపేరిట మొక్క నాటడం కార్యక్రమంలో పాల్గొంటున్నారని అన్నారు. ఇందులో ఆంధ్రా మరింత ముందుంజలో ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బిఆర్‌ఎయు రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య సి.సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.అనురాధ, జర్నలిజం విభాగం అధ్యాపకులు డాక్టర్ ఆర్.తిరుపతిరావు, డాక్టర్ జి.లీలా వం ప్రసాదరావు, డాక్టర్ వై.డి.రామదాస్, పీడీ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు ఎం.రామారావు, టి.భవాని పాల్గొన్నారు. ఇందులో భాగంగా, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులచే నిర్వాహకులు ప్రతిజ్ఞ చేయించారు.


మొక్కను నాటుతున్న విసి రజని

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి సాధ్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి గొండు రఘురాం అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని సమస్యలతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధిపై చర్చించారు. మండలంలో అనేక మారుమూల ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్‌టిసి బస్‌లు నడవడం లేదని, దీనివల్ల ప్రయాణికులు ఆటోలపై, కాలినడకపై ఆధారపడాల్సి వస్తోందని సభ్యులు ప్రస్తావించారు. గ్రామాలకు బస్సు సౌకర్యం కావాలని కోరారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారుల సమన్వయం ఎంతో కీలకమని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

అన్నారు. సమస్యలను గుర్తించడంలోను, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించడంలోను అధికారులు ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. ఉన్నత స్థాయిలో చర్చించేందుకు వీలుగా సూచనలు చేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందన్నారు. అధికారులు, వైద్యులు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్యంతో పాటు మందులు అందుబాటులో ఉండాలన్నారు. శివారు ప్రాంతాలకూ సాగునీరు అందించి రైతులకు ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో ఆదుకుంటామన్నారు.

రైతులకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ కింద కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. విద్య, వైద్యం పేద ప్రజలకు అందేలా అధికారులు దృష్టిసారించాలన్నారు. నాణ్యమైన 24 గంటల విద్యుత్ నిరంతరంగా అందించాలని విద్యుత్‌శాఖను ఆదేశించారు. వ్యవసాయ రంగంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి, ఎంపిడిఒ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు


టెక్కలి : వేషధారణలో రవీంద్ర భారతి చిన్నారులు

ప్రజాశక్తి- టెక్కలి

శ్రీకృష్ణ జయంతి సందర్భంగా పట్టణంలోని పలు ప్రయివేట్ పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపిక, యశోద వంటి వేషధారణలతో అలరించారు. సంస్కృతి, సంప్రదాయాలను డీన్ నాగరాజ్ వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఓక్లాండ్ అంతర్జాతీయ పాఠశాలలో ప్రిన్సిపాల్ మల్ల మధులత ఆధ్వర్యాన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాల గురించి వివరించారు. చిన్నారులు ప్రదర్శించిన ప్రదర్శనలు అలరించాయి. అనంతరం విద్యార్థులు ఉట్టి కొట్టి సందడి చేశారు. అలాగే స్థానిక అమ్మఒడి పాఠశాలలో కరస్పాండెంట్ బరాటం శ్రీనివాస్ ఆధ్వర్యాన విద్యార్థులు శ్రీకృష్ణ వేషధారులతో ఆకట్టుకున్నారు. సందర్భంగా పలు ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసన్నపేట : స్థానిక శ్రీజ్ఞానజ్యోతి స్కూల్లో శ్రీకృష్ణామి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు గోపికలు, శ్రీకృష్ణుడు వేషాలు, డాన్స్‌లు ఆకట్టుకున్నాయి. అనంతరం మారుతీ నగర్ వీధిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బి.రామారావు, భాస్కరరావు, టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని దండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొండు నారాయణరావు విద్యార్థులకు వేయించిన శ్రీకృష్ణుడుతో పాటు పలు దేవతామూర్తుల వేషధారణ పలువురు చూపర్లకు అకట్టుకుంది. అలాగే ఉట్టిని కట్టి విద్యార్థులో కొట్టించి ఘనంగా వేడుకలు నిర్వహించారు. అలాగే కోటబొమ్మాళి వంశధార విద్యసంస్థలో వ్యవస్థాపకులు చింతాడ అనిరుద్రుడు ఆధ్వర్యాన విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా


లావేరు : కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు


టెక్కలి : ఉట్టి కొడుతున్న ఓక్లాండ్ విద్యార్థులు

నిర్వహించారు. చిన్నారులు దేవతామూర్తులుగా వేసిన వేషధారణ పలువురుకు ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు ఉట్టిని కొట్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వంశధార డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ డి.వి.రమణమూర్తి, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సింహాచలం, ధనలక్ష్మి, ధరణి పాల్గొన్నారు.

లావేరు: మండలం తాళ్లవలస అంగన్వాడీ కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత ఆధ్వర్యంలో చేపట్టారు. ఇందులో భాగంగా పిల్లలు కృష్ణుడు, గోపికల వేషాలతో నృత్యం చేసి పలువురుని అలరించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి మాట్లాడుతూ చిన్నారుల్లో చిన్నతనం నుంచే పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలపై మక్కువ పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ ఇనపకుర్తి అశ్విని, మహిళా పోలీస్ కామేశ్వరి, ఇజ్జు వెంకట వరలక్ష్మి, ఆయా శిమ్మమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్‌ఐలుగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం ఎస్‌ఐగా సంచాన చిరంజీవి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ కూన గోవిందరావు శ్రీకాకుళం విఆర్‌కు బదిలీ కావడంతో, ఎచ్చెర్ల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న చిరంజీవి జె.ఆర్.పురం ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేకంగా నిఘా పెట్టడం జరుగుతుందన్నారు.

లావేరు: లావేరు ఎస్‌ఐగా జి.లక్ష్మణరావు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన సిహెచ్ స్వామినాయుడు విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌సి రామారావు, చక్రి, వెంకటరమణ తదితర సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బూర్జ: బూర్జ మండల ఎస్‌ఐగా ఎం.ప్రవళ్లిక బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన జి.వి. ప్రసాద్ విఆర్ విశాఖ రేంజ్‌కు బదిలీపై వెళ్లారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ప్రవళ్లిక తెలిపారు.

పోలాకి: పోలాకి ఎస్‌ఐగా జి.రంజిత్ శనివారం ఉద్యోగం బాధ్యతను చేపట్టారు. ఈ సందర్భంగా ఎఎస్‌ఐలు, పోలీసులు ఆయనకు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలం లోని శాంతిభద్రతలు పరిరక్షణకు, క్రైం రేటు తగ్గించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ సత్యనారాయణ బదిలీపై వెళ్లారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐగా ఇ.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్‌ఐగా


చిరంజీవి లక్ష్మణరావు ప్రవళ్లిక

ఉన్న లక్ష్మణరావు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో శ్రీనివాసరావును నియమించారు. ఈయనకు పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

మందస : మందస ఎస్‌ఐగా ఖాదర్ బాష శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లా కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. ఈయనకు పుష్పగుచ్ఛంతో సిబ్బంది స్వాగతం పలికారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎస్ఐ అనిల్‌కుమార్ సారవకోట బదిలీ అయ్యారు.



ఎన్నాళ్లీ నిరీక్షణ?

కవిటి: తరగతి ధ్రువీకరణ పత్రాల కోసం ఇంకెన్నాళ్లు తాము వేచి చూడాలని బెంతు ఒరియాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 241వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా శనివారం దీక్షలో పాల్గొన్న కమిటీ సభ్యులు మాట్లాడుతూ తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ బిడ్డల చదువులు కుంటు పడు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో అనేకమంది ఒరియా విద్యార్థులు ధ్రువీకరణ ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో కొంతమంది విద్యార్థులు కళాశాల ప్రవేశాలు, మరికొంత మంది విద్యార్థులు హాస్టల్లో సీట్లు కోల్పోయారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ గోడు పట్టించుకోవాలని కోరారు.

'అక్లేటిక్' షాపు ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: నేటి ఆధునిక యుగంలో మహిళలకు ఆకట్టుకునే ఆభరణాలు నగరంలో కూడా అందుతున్నాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని జిటి రోడ్‌లో శనివారం అక్లేటిక్ వెండి, బంగారు, వజ్రాభరణాల దుకాణాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాన్ని సుందరంగా ప్రారంభించారని చెప్పారు. ప్రజలు ఇటువంటి దుకాణాలను ఆదరించాలని, ఇతర ప్రాంతాల్లో లభించే ఆభరణాలకు దీటుగా ఇక్కడ ఆభరణాలను ప్రదర్శించారని చెప్పారు.


బంగారం షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

మెరుగైన సేవలందిస్తా

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని పురపాలక సంఘ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల విజయనగరం జిల్లా నెల్లిమర్ల నుంచి బదిలీపై ఆమదాలవలసకు వచ్చిన ఆయనకు ఎఇ కె.అప్పలనాయుడు టౌన్ ప్లానింగ్ అధికారి హెచ్.వి.సత్యనారాయణ, అకౌంటెంట్ సాయిరాం, ఆర్ఐ ఎం.రామారావు, మున్సిపల్ సిబ్బంది స్వాగతం పలికారు. ఎన్నికల బదిలీలో భాగంగా అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి వచ్చిన జి.రవి తిరిగి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలో తాగునీరు, పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి కనబర్చి పట్టణ వాసులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారంతో పాటు పూర్తిస్థాయి అభివృద్ధికి సహచర ఉద్యోగులు, పట్టణవాసులు సహకరించాలని ఆయన కోరారు.

కళలు అంతరించిపోకూడదు


సిడిని విడుదల చేస్తున్న ఇంటాక్ కన్వీనర్ సన్యాసిరావు

శ్రీకాకుళం అర్బన్: కళలు అంతరించిపోకూడదని, సాంస్కృతిక రంగాలకు శ్రీకాకుళానికి ప్రత్యేక స్థానముందని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. అంతరించిపోతున్న కళలు, చేతి వృత్తుల అంశంపై భారత జాతీయ కళలు, సంస్కృతి వారసత్వ సంస్థ (ఇంటాక్) జిల్లా కన్వీనర్ నూక సన్యాసిరావు ఆధ్వర్యాన రెడ్‌క్రాస్ ఆవరణలో గల స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో శనివారం ఇంటాక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సంస్కృతి, సాంప్రదాయ కళలు, ఖాదీ, చేతివృత్తుల పరిరక్షణకు సమిష్టి కృషి జరగాలన్నారు. ప్రధానంగా శ్రీకాకుళం యాస, భాష, పల్లె పదాలు, గీతాలు, నాటక రంగ నృత్యాలు, గేయాలు, తప్పెడు గుళ్ళ, శివభాగోతాలు, బుర్రకథలు, మై మై గుబ్బం, నెమలి నాట్యం వంటి అనేక సంస్కృతులు ఉన్నాయన్నారు. వాటిని కనుమరుగు కాకుండా కాపాడు కోవాల్సిన అవసరం ఉందన్నారు. పండగల్లోను, పాఠశాలల్లో ప్రదర్శనల ద్వారా ప్రజలకు తెలియ జెప్పాలన్నారు. సమావేశంలో ఇంటాక్ సభ్యులు జగన్నాధం నాయుడు, పి.జగన్మోహనరావు, రామ లింగేశ్వరరావు, సూరంగి మోహనరావు, ఎం.ప్రసాదరావు, కె.రమణమూర్తి, పొన్నాడ రవికుమార్, విష్ణుమూర్తి పాల్గొన్నారు. అనంతరం సిడిని విడుదల చేశారు.

స్వీయ పరీక్షా విధానంతో పని దినాలు వృథా

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన స్వీయ పరీక్ష విధాన షెడ్యూల్ ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 4 వరకు నిర్వహించడం పాఠశాల పని దినాలను వృథా చేసే విధంగా ఉందని డిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పూజారి హరి ప్రసన్న, పేడాడ కృష్ణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరం వరకు గల ఫార్మేటివ్ పరీక్ష విధానం మూడు పని దినాలలో నిర్వహించేవారని, ఈ విద్యా సంవత్సరానికి ఫార్మేటివ్ పేరు మార్చి స్వీయ పరీక్షా విధానం (సెల్ఫ్ అసెస్మెంట్) పేరుతో నిర్వహిస్తున్న పరీక్షలను ప్రతిరోజూ గంట సేపు మాత్రమే నిర్వహించేందుకు ఐదు రోజులు వృథా అవుతుందన్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులకు ఐదు రోజులు, ఆరు నుంచి 10 తరగతుల వరకు ఏడు రోజులు నిర్వహించడం వలన పని దినాల్లో విద్యార్థుల కాలాన్ని వృథా చేయడమే అవుతుందన్నారు. రోజుకు రెండు పరీక్షలు నిర్వహించడం ద్వారా పని దినాలు వృథా కాకుండా మార్పు చేయాలని కోరారు.

విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దా..

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పేద, మధ్యతరగతి విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడం మిక్కిలి సంతృప్తినిచ్చిందని ఎంఎస్‌పురం రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ పరుశురాంపురం శివప్రసాద్ అన్నారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా శనివారం ప్రజాశక్తితో మాట్లాడారు. రాజమండ్రిలో పరుశురాంపురం నారాయణమూర్తి, లక్ష్మి దంపతులకు 5వ సంతానంగా శివప్రసాద్ 1964 ఆగస్టు 11న జన్మించారు.


శివప్రసాద్

విద్యాభ్యాసం

తన తండ్రి తహశీల్దార్ కావడంతో శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో 1969లో 1 నుంచి 5 వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించాను. 6, 7 తరగతులు నరసన్నపేట హైస్కూల్‌లో, 8వ తరగతి విజయనగరం జిల్లా పార్వతీపురం హైస్కూల్‌లో, 9వ తరగతి శ్రీకాకుళం జిల్లా రాజాంలో మరలా పార్వతీపురంలో 10వ తరగతి వరకు ఇలా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశారు. 1979 నుంచి 1981 వరకు ఇంటర్మీడియట్ విద్య మొదటి ఏడాది పార్వతీపురం, రెండవ ఏడాది పెందుర్తిలో పూర్తి చేశారు. 1981 నుంచి 1984 వరకు విజయనగరం మహారాజా కాలేజ్‌లో డిగ్రీ పట్టా పొంది బిఇడి అక్కడే పూర్తి చేశారు. విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఎస్‌సి, పీజీ పూర్తి చేశారు.

ఉద్యోగ జీవితం

1989లో విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కనిమెల్లలో మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎంగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఆరు నెలల తర్వాత 1989 డిసెంబర్‌లో ఎపి రెసిడెన్షియల్ స్కూల్ భద్రగిరిలో టిజిటి గణిత అధ్యాపకునిగా ఉద్యోగం వచ్చింది. 2022లో నర్సీపట్నం రెసిడెన్షియల్ స్కూల్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టి స్కూల్‌ను తన ఆలోచనలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. 2023లో శ్రీకాకుళం జిల్లా ఎస్.ఎం.పురం రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించి 2024 ఆగస్టు నెల 31న ఉద్యోగ విరమణ గావించనున్నారు.

సంతృప్తినిచ్చిన అంశం

35 ఏళ్ల సర్వీసులో ఎంతోమంది పేద, మధ్యతరగతి విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడం, తన పిల్లలిద్దరూ మంచిగా స్థిరపడడం చాలా సంతృప్తి నిచ్చిందన్నారు.

కుటుంబ నేపథ్యం

భార్య వాణిశ్రీ నర్సీపట్నంలో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తున్నారు. కుమారుడు హృదయ్ బిటెక్. కుమార్తె స్పందన డాక్టర్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు.

శేష జీవితం

విద్యార్థులతో మమేకమై పనిచేయడం వలన కుటుంబాన్ని సక్రమంగా చూడలేక పోయాను ఇప్పటికీ ఆ బాధ వెంటాడుతుంది. సొంత ఇల్లు కూడా నిర్మించు కోలేక పోయాను. నా శేష జీవితం నా కుటుంబం బాగుకోసం పనిచేయాలని నిర్ణయించుకున్నాను.


అప్పలస్వామి మృతదేహం

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని మంచినీళ్లపేటకు చెందిన మత్స్యకారుడు సూరాడ అప్పలస్వామి (61) వేటకు వెళ్లి వస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందారు. తోటి మత్స్యకారులతో కలిసి సంద్రంలోకి వేటకు వెళ్లారు. వేట ముగించుకుని ఒడ్డుకు చేరకుని పడవను లంగరు వేసేందుకు తాడు లాగాడు. ఒక్కసారిగా అక్కడిక్కడే తీరంలో కుప్పకూలిపోయాడు. తోటి మత్స్యకారులు ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరై రోదిస్తున్నారు. ఎఎస్ఐ జిన్నారావు సంఘటనా స్థలానికి చేరకుని తీరంలోనే పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు కుమారుడు ఎస్.లింగరాజు ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వం మృతుడి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తప్పిన ప్రమాదం

టెక్కలిరూరల్: మండలంలోని చిన్న నారాయణ పురంలో శనివారం మధ్యాహ్నం ఓ ఇంట్లో గ్యాస్ లీకైంది. దీంతో ఇంట్లో నుంచి వంట గ్యాస్ లీకైన వాసన రావడంతో సమీప ఇళ్లకు చెందిన వ్యక్తులు అప్రమత్తమయ్యారు. వెంటనే యువకులు గ్యాస్ సిలిండర్లను బయటకు దొర్లించడంతో ప్రమాదం తప్పింది. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. సిబ్బంది శకటంతో వచ్చి సహాయక చర్యలు చేపట్టారు.


పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

ప్రధానోపాధ్యాయులకు మెమో

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్నంనాయుడుకు విద్యాశాఖాధికారులు మెమో జారీ చేశారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఆలీ ఖాన్, టెక్కలి ఇన్‌ఛార్జి డిప్యూటీ విద్యాశాఖాధికారి విజయకుమారి, శ్రీకాకుళం బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాగ్దేవి సందర్శించారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై అదే తరగతి చదువుతున్న విద్యార్థి వేధింపులకు గురి చేస్తున్నట్లు బాలిక తండ్రి ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించి జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు పర్యటించి వివరాలు సేకరించారు. బాలిక, విద్యార్థిని పక్కపక్కనే పెట్టి విచారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలిక తండ్రి ఫిర్యాదు చేసినా పాఠశాల హెచ్ఎం చిన్నంనాయుడు స్పందించలేదన్న విషయాన్ని పరిశీలనలో తేలిందన్నారు. దీనిపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని హెచ్‌ఎంకు ఛార్జీ మెమోను జారీ చేశామని చెప్పారు. మంగళవారం మరలా దర్యాప్తు చేపడతామని తెలిపారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

కోల్‌కతా మెడికల్ కాలేజీలో ట్రైనీ విద్యార్థినిపై అత్యాచారం చేసి ఆపై పాశవికంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి టేకి ఆచారి అన్నారు. మండలం ధర్మవరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ బాధితురాలిని హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని, వారి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, మహిళలు, బాలికలపై జరుగుతున్న ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసు కోవాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న జనసేన నాయకులు

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- పొందూరు

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం వద్ద ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పట్టణానికి చెందిన హంస ప్రదీప్ (ప్రశాంత్) కుటుంబ సభ్యులను శనివారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, ఆమదాలవలస నియోజకవర్గం ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్‌లు పరామర్శించారు. ఈ ప్రమాదంలో కుటుంబ పెద్ద దిక్కుని కోల్పోయామంటూ రోధించిన కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో జనసేన నాయకులు హంస బాబి, జిల్లా సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నంనాయుడు, మండల అధ్యక్షుడు ఎలకల రమణ, జనసేన నాయకులు హరినాథ్, బెల్లం శివ, శిమ్మి నాయుడు పాల్గొన్నారు.

గ్రామసభలు విజయవంతం


దుర్గారావు

పలాస : టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీలో తొలిసారిగా నిర్వహిం చిన గ్రామసభలు విజయ వంతంగా నిర్వహించారని జనసేన సమన్వయ కర్త డాక్టర్ వి.దుర్గారావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం హయాంలో నిర్వీర్యమైన పంచాయతీ రాజ్ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం పునర్జీవం పోయడానికి సాయశక్తులా కృషి చేస్తున్నారన్నారు. సిఎం చంద్ర బాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల సారథ్యంలో పారదర్శక పాలన అందించే దిశగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించారన్నారు. ఒకేరోజు గ్రామసభలు నిర్వహించాలన్న నిర్ణయం చారిత్రాత్మ కమన్నారు.

అక్కివలస ఎస్‌ఎంసి ఎన్నిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని 5వ వార్డు అక్కివలస మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించారు. ఎస్‌ఎంసి ఎన్నికల్లో కర్రి లావణ్యను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. సీనియర్ టిడిపి నాయకులు తంగి గుర్రయ్యను పాఠశాల అభివృద్ధి పర్యవేక్షణ నిమిత్తం కోఆప్టెడ్ సభ్యుడిగా ఎన్నుకున్నారు. అనంతరం హెచ్‌ఎం నూతన ఎస్‌ఎంసి కమిటీ చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

రక్తదాతలు ముందుకు రావాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అత్యవసర సమయాల్లో వైద్యులు రక్తాన్ని చిందించి పదిమంది ప్రాణాలు కాపాడేందుకు స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు రావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహనరావు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఓ పాజిటివ్ రక్తం అవసరంకాగా రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటం గొప్ప విషయమని, అత్యవసర పరిస్థితుల్లో ముందుకు రావాలన్నారు. రక్తదాత రమణ మాట్లాడుతూ నిరంతర సేవలో ముందుండే ఒక ఉద్యోగిగా కాకుండా, సేవకునిగా రక్తమివ్వడం ఆనందంగా ఉందన్నారు. నరసన్నపేటకు చెందిన వి.సూర్యనారాయణకు ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గిపోవటంతో నరసన్నపేట కె.జె.కె మెడి వరల్డ్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆయనకు ఎ పాజిటివ్ ఎస్‌డిపి అవసరమని తెలపడంతో గొలివి రమణ ముందుకు వచ్చి రక్తదానం చేశారు.



వీల్‌చైర్ అందజేస్తున్న గోవిందరావు

వీల్‌చైర్ అందజేత

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక భవిత కేంద్రం ఆధ్వర్యంలో అచ్చిపోలవలసకు చెందిన బి.మహేష్ అనే వికలాంగ విద్యార్థికి జిల్లా సహిత విద్య కో-ఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు చేతులమీదుగా వీల్‌చైర్‌ను అందజేశారు. మండలంలోని అచ్చిపోలవలస, కాజీపేటలో గృహ ఆధారిత విద్యను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అచ్చిపోలవలసకు చెందిన వికలాంగ విద్యార్థికి వీల్‌చైర్ అందజేయగా, కాజీపేటలో వికలాంగ విద్యార్థుల గృహ విద్యను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అచ్చిపోలవలస హెచ్‌ఎం శ్రీనివాసరావు, సహిత విద్య రిసోర్స్ పర్సన్ దినేష్ పాల్గొన్నారు.

గ్రిగ్స్ పోటీలపై సమీక్ష

ప్రజాశక్తి- పొందూరు

మండలస్థాయి గ్రిగ్స్ పోటీల నిర్వహణపై స్థానిక ఎంఆర్‌సిలో ఎంఇఒ-2 పట్నాన రాజారావు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులతో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రిగ్స్ పోటీలకు అనుకూలంగా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. మండల స్థాయి గ్రిగ్స్ పోటీలను సెప్టెంబరు 10 నుంచి 12 వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 10న కబడ్డీ, వాలీబాల్, 11న ఖోఖో, టెన్నీకాయిట్, 12న బ్యాడ్మింటైన్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సరుబుజ్జిలిలో భారీ వర్షం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని పలు ప్రాంతాలతో పాటు మండల కేంద్రమైన సరుబుజ్జిలిలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పు రావడంతో పాటు చిన్నపాటి చిరుజల్లులు కురుస్తూ మధ్యాహ్నం సమయంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలో ప్రధాన రహదారులన్నీ జలమయంగా మారి వాహనాల రాకపోకలకు కొంతమేర ఇబ్బందులు ఎదురయ్యాయి.

పారిశుధ్య నిర్వహణకు నిధుల మంజూరు



కాలువలో చేపడుతున్న పూడికతీత పనులు

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం రూ.29.71 లక్షల నిధులను మంజూరు చేసినట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పురపాలక సంఘంలోని 23 వార్డుల్లో కాలువల్లో పూడికతీత పనులను ముమ్మరంగా పురపాలక సంఘ అధికారులు చేపట్టారు. అలాగే ఆ నిధులలో కొంత మొత్తంతో సీజనల్ వ్యాధులను అరికట్టుటకు కొత్త స్ప్రేయింగ్ మిషన్లు, ఏడు ఫాగింగ్ మిషన్లు, రెండు బ్లీచింగ్ తదితర సామగ్రిని కొనుగోలు చేసి పుర ప్రజల సమస్యలను తీర్చడానికి వినియోగించనున్నట్లు తెలిపారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల బారి నుండి కాపాడేందుకు పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టడం, అలాగే నిధులు తెచ్చిన ఎమ్మెల్యే రవికుమార్ కృషిపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరు చేసినందుకు సిఎం చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖామంత్రి నారాయణకు ఎమ్మెల్యే రవికుమార్ కృతజ్ఞతలు తెలిపినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

భుజంగరావుకు సాహితీ పురస్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



భుజంగరావు, రచయిత

కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన యువ సాహితి సేవాసంస్థ ప్రతిఏటా అందిస్తున్న పల్లా జాతీయ కవితా పురస్కారం - 2024కు సాహితీ వేత్త కంచరాన భుజంగరావు రాసిన నీటిగింజలు కవిత ఎంపికైంది. ఈ మేరకు శనివారం యువసాహితీ సేవాసంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పల్లా కృష్ణ నుంచి ఆయనకు వర్తమానం అందింది. సంస్థ ద్వారా గడచిన ఏడేళ్లుగా ఈ పురష్కారాన్ని అందిస్తున్నారు. ఈ ఏడాదికిగాను భుజింగరావు కవితను ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి కవులు తమ రచనలు పంపి పోటీలో పాల్గొన్నారని అందులో నీటిగింజలు ఈఏడాది ఉత్తమ కవితగా న్యాయ నిర్ణీతలు ఎంపిక చేశారని వర్తమానంలో తెలియజేశారు. జాతీయ స్థాయిలో సాహితీ సదస్సులో ఈపురష్కారాన్ని అందించనున్నట్టు వారు లిఖిత పూర్వకంగా తెలిపారు. రూ.5,116 నగదు పురష్కారంతో పాటు సత్కారం ఉంటుందని వారు పేర్కొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శాంతిశ్రీ

ప్రజాశక్తి- పలాస

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, శిశుసంక్షేమశాఖ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. మండలంలోని రెంటికోట రేషన్ డిపోను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలో నిల్వ ఉన్న సరుకులకు, రికార్డుకు సరిపోయిందీ, లేనిదీ పరిశీలించారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. అలాగే మూడో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యకర్తలు, ఆయాలు సమయపాలన పాటించాలన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆమెతో పాటు పలాస పౌర సరఫరాలశాఖ డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్, విఆర్ఒ ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

పశువుల సంచారంపై చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో పశువులు, పందులను నిర్ధేశించిన ప్రదేశాల్లో మినహా మిగిలిన చోట్ల రోడ్లపై సంచరిస్తున్నట్టు గుర్తిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ హెల్తాఫీసరు డాక్టర్ సుధీర్‌కుమార్ హెచ్చరించారు. శనివారం పశువులు, పందుల పెంపకందారులతో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పశువులు, పందులను రోడ్లపైకి, వీధుల్లో, ఖాళీ స్థలాల్లో విడిచిపెట్టడం వలన పరిసరాలు అపరిశుభ్రంగా మారుస్తున్నాయని, పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన వివరించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా నగరానికి 5 కిలోమీటర్ల దూరంలో పందులు, సొంత స్థలాల్లో పశువులు సంరక్షించు కోవాలని సూచించారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్ కుమార్

ఇకపై పశువులు, పందులు రోడ్లపై సంచరిస్తుంటే పట్టుకుని సీతంపేట అడవుల్లో విడిచిపెడతామని హెచ్చరించారు.

నీటమునిగిన పంట పొలాలు



ముంపునకు గురైన పంట పొలాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బాహుదా నదిలో వరద నీరు చేరింది. దీంతో తీరప్రాంత గ్రామాల్లోని శనివారం వందల ఎకరాల పంట పొలాల్లో వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద నీరుచేరడంతో డొంకూర్ తీరంలోని పొగురు కప్పేసింది. దీంతో సముద్రంలో కలవాల్సిన వదర నీరు పంట పొలాల్లో చేరడంతో వరి నాట్లు మునిగాయి. మండలంలోని బూర్జపాడు, డొంకూరు, పెద్దలక్ష్మీపురం, చిన్నలక్ష్మీపురం, శివకృష్ణాపురం తదితర ప్రాంతాల్లో వేసిన వరినాట్లు కుళ్లిపోతాయోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు మూడు వందల ఎకరాలు ముంపునకు గురైంది. దీంతో పాటు డొంకూరు వెళ్లే బూర్జపాడు కాజ్‌వే మీదుగా వరద నీరు చేరడంతో రాకపోకలకు స్వల్పంగా ఆటంకం ఏర్పడింది.



అవస్థలు పడుతున్న వాహనదారుడు

వర్షం కురిస్తే చెరువే..

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండి బస్టాండ్‌లో వర్షం కురిస్తే చెరువును తలపిస్తుంది. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. శనివారం కురిసిన ఒక మోస్తరు వర్షానికి నీరు చేరడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. వైఎస్ఆర్ కూడలి వద్ద రోడ్‌పైన నీరు చేరి ఉండటంతో అటుగా వెళ్లే స్థానికులు పాఠశాల పిల్లలకు భోజనం తీసుకెళ్లి తల్లితండ్రులు నానా అవస్థలు పడ్డారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు నిల్వ ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు చెరువులను తలపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉన్న రహదారిపై అధికారులు దృష్టి పెట్టిలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు

పలాస : గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎంపిడిఇఒ ఎన్.రమేష్ నాయుడు అన్నారు. మండలంలోని లొత్తూరు పంచాయతీలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో సమస్యలు గుర్తించి రోడ్లు, కాలువలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. సమావేశంలో ఎంఇఒ సిహెచ్. శ్రీనివాసరావు, ఎఎస్ఒ జోగారావు, కార్యదర్శ రూపేంద్రరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: మండలంలో కేదారిపురానికి చెందిన ఆసి దుర్యోధన ఇటీవల మృతి చెందారు. మృతుడికి ఋగ్గురు అమ్మాయిలు. పేద కుటుంబం కావడంతో ఆ పిల్లలకు మేము ఉన్నామంటూ కేదారిపురం గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు ముందుకొచ్చారు. ఒక్కో పిల్ల పేరున రూ.20 వేలు చొప్పున పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పుస్తకాలను మృతుడి భార్యకు అందజేశారు.

లోక్ అదాలత్‌పై అవగాహన

కోటబొమ్మాళి: సెప్టెంబరు 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై గ్రామాల్లో తహశీల్దార్లు, ఎంపిడిఒ అవగాహన కల్పించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు మండలాలకు చెందిన తహశీల్దార్ల, ఎంపిడిఒలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ గ్రామాల్లో ఏళ్లతరబడి పరిష్కారం కానీ కేసులు ఉండే వారికి లోక్‌అదాలత్ గురించి వివరించారు. రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖలో ఏవైన కేసులు పెండింగ్‌లో ఉంటే ఇరు పార్టీలను పిలిపించి రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కోటబొమ్మాళి తహశీల్దార్లు ఆర్.అప్పల రాజు, జలుమూరు తహశీల్థార్ జి. లక్ష్మీ నారాయణ, సంతబొమ్మాళి డిటి హరిబాబు, ఎంపిడిఒ ఉమా మహేశ్వరరావు, ఎస్‌సిబి ఇన్‌స్పెక్టర్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జిప్రసన్నలత